## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నారాయణపేట, అక్టోబర్ 5: వాహనదారులు తప్పనిసరిగ్గా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ తిరుపతి అన్నారు. గురువారం పట్టణంలో నిబంధనలు పాటించని వాహనదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మాట్లాడారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేని వారు వేయించుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని, వాహనాలు నడిపేవారు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణం చేయరాదని, పరిమితికి మంచి ఆటోలలో ప్రయాణించరాదన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడరాదని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ దేవేందర్, తిరుపతి, మధు, వాహనదారులు పాల్గొన్నారు.



వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

## అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి





ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ పోలీసులు

నారాయణపేట, అక్టోబర్ 5: ప్రయాణికులు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని షీ టీం సిబ్బంది బాలరాజు, సమీనా అన్నారు. గురువారం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, దొంగతనాలు తదితర వాటిపై ప్రయాణికులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్, ఇంటికి వెళ్లే సమయంలో అమ్మాయిలను వేధించినా, ఇబ్బందులకు గురి చేసినా షీ టీం నెంబర్ 8712670398కు లేదా 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కొత్త వ్యక్తులు ఏవైనా తినుబండారాలు ఇస్తే తీసుకోరాదని సూచించారు. కార్యక్రమంలో ప్రయాణికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ అభ్యర్థికి సన్మానం



శివకుమార్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

నారాయణపేట, అక్టోబర్ 5: అగ్నివీర్‌కు ఎంపికైన పట్టణానికి చెందిన శివకుమార్‌ను గురువారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించిన శివకుమార్ అగ్నివీర్‌కు ఎంపికకావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శివకుమార్, అబ్దుల్ అలీం, పంకజ్, నల్లారెడ్డి, అజిత్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

మక్తల్‌టౌన్, అక్టోబర్ 5: ఎంపీపీ వనజమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సద్గుణ గురువారం ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైతారన్నారు. సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

## పీఆర్సీ ప్రకటించడం హర్షణీయం

నారాయణపేట, అక్టోబర్ 5: సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులకు రెండో పీఆర్సీ ప్రకటించడం హర్షణీయమని మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీం, సెక్రటరీ యూసుఫ్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



సర్పంచులు, కార్యదర్శులకు స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం



మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

# అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు
- ఆడపడుచులు బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలి
- మైనార్టీ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి
- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్, అక్టోబర్ 5 : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారని, రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ఆయనకే దక్కిందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మహిళలకు బతుకమ్మ చీరలు, ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు, గ్రామ పంచాయతీలకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ పండుగను కుల, మతాలకతీతంగా మహిళలు ఘనంగా జరుపుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ అన్ని మతాల పండుగలకు ప్రాముఖ్యత కల్పిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం అందించిన కుట్టు మిషన్లను ముస్లిం మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవతో గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్నామన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు మానసికోల్లాసంగా ఉంటారని యువతకు సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని దేవినగర్‌లో రూ. 5 లక్షలు, చిన్నపొర్ల గ్రామం లోని ఎస్సీ కాలనీలో రూ. 5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లాగౌడ్, జిల్లా క్రీడాశాఖాధికారి శెట్టి వెంకటేశ్, ఎంపీడీవో రమేశ్‌కుమార్, ఐకేపీ ఏపీఎం నిర్మల, సర్పంచులు సూర్యప్రకాశ్‌రెడ్డి, సుమంగళ, కతలప్ప, యశోద, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, ఉప సర్పంచ్ ఒబేదుర్ రహిమాన్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాఘవరెడ్డి, పద్మ, షహనాజ్‌బేగం, హన్మంతు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

మక్తల్‌టౌన్, అక్టోబర్ 5: రాష్ట్రంలో మైనార్టీ సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన కుట్టు మిషన్లను గురువారం ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పాటుపడుతున్నారన్నారు. మక్తల్ నియోజకవర్గానికి 200 కుట్టు మిషన్లు మంజూరు కాగా మక్తల్ పట్టణంలో 85 మందికి లబ్ధిదారులకు అందజేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి ప్రతి మహిళాతల్లి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఈశ్వర్‌యాదవ్, అన్వర్ హుస్సేన్, షాలంబిన్ ఉమర్, శంషొద్దీన్, సాధిక్, మజర్ పాల్గొన్నారు.

### ఆడపడుచుల ఆత్మగౌరవం కోసం..

కృష్ణ, అక్టోబర్ 5 : తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏటా బతుకమ్మ పండుగకు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నదని ఎమ్మెల్యే చిట్టెం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఎంపీపీ పూర్ణిమాపాటిల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బతుకమ్మ చీరలు, క్రీడా కిట్లు, ఆసరా పింఛన్ ప్రొసీడింగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అంజనమ్మపాటిల్, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌పాటిల్, ప్రధా న కార్యదర్శి మోనేశ్, మండల నాయకుడు శివరాజ్ పాటిల్, అన్ని గ్రామాల సర్పం చులు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### అన్నివర్గాల సాంప్రదాయాలకు గౌరవం...

మాగనూర్, అక్టోబర్ 5: తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల సంస్కృతి , సాంప్రదాయాలను గౌరవిస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బతుకమ్మ చీరలు, కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు, పింఛన్ల ప్రొసీడింగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, వైస్ ఎంపీపీ తిప్పయ్య, పీఏసీసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో జైపాల్ రెడ్డి, సర్పంచులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

### నర్వలో...

నర్వ, అక్టోబర్ 5: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంపీపీ జయరాములు శెట్టి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 10,396 మంది మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీణావతి, సర్పంచ్ సంధ్య, ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు అంజప్ప, మహదేవప్ప, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, నాయకులు కిరణ్‌ప్రకాశ్‌రెడ్డి, శంకర్, చిన్నయ్య, వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీటీసీలు కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

# దళిత బంధుతో ఆర్థికాభివృద్ధి సాధించాలి



దళితులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధన్వాడ, అక్టోబర్ 5 : దళితబంధుతో ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా హార్టికల్చర్ ఆధికారి సాయిబాబ అన్నారు.. గురువారం ధన్వాడ కన్వెన్షన్ హాల్ లో రెండో విడుత దళితబంధు లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబ మాట్లాడుతూ లబ్ధిదారులు మొదట్ల ఎంపిక ఆలోచన కు స్పష్టి చెప్పాలని, ఎకరా భూమి ఉన్న రైతులు కురగాయాలు, పండ్లతోటలు పెంపకం చేపట్టాలని కోరారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ దళిత బంధు పథకంలో డ్రోన్స్‌పరికరాలు , ఐస్ క్యాండిల్స్ కొనుగోలు చేసుకోవాలని, ఇటుక బట్టీల ఏర్పాటు , మినీ రైస్ మిల్లుల ఏర్పాటుతో దళితులు ఆర్థికాభివృద్ధి చెందుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు హరినాథ్ రెడ్డి, రాజ్‌కుమార్, మహిపాల్ రెడ్డి, స్వప్న, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ గండి బాలరాజు, సర్పంచులు అమరేందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, చంద్రప్ప, ఎంపీటీసీలు సుధీర్‌కుమార్‌రావు, కడపయ్య, బీఆర్ఎస్ నాయకులు సునీల్‌రెడ్డి, భీరెండ్డి, వీరేశ్ గౌడ్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

మరికల్, అక్టోబర్ 5: ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతయ్య గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఎలిగండ్ల గ్రామ పాఠశాలలో తరగతి గదుల ప్రారంభోత్సవం, మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి చెక్కులు, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### ధన్వాడలో...

ధన్వాడ, అక్టోబర్ 5: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి స్పోర్ట్స్‌కిట్లు, బతుకమ్మచీరల పంపిణీ, బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ వెంకట్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు.

## నేడు దళిత బంధు పై అవగాహన

మరికల్ , అక్టోబర్ 5: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం దళిత బంధు పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, దళితబంధు లబ్ధిదారులు విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.